

పర్యాటకం కళకళ..

ఏజెన్సీకి పర్యాటకుల తాకిడి

- వర్షాల్లోను తగ్గని సందర్శనలు
- బొర్రాగుహలు, జలపాతాలు, సుందర ప్రదేశాల్లో సందడి


ఆదివారం బొర్రాగుహలకు వచ్చిన పర్యాటకులు

అనంతగిరి/అరకులోయ, జూలై 28: విశాఖ మన్యంలో ప్రకృతి అందాలను తిలకిం చేందుకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గడంతో పర్యాటకులు బొర్రా గుహలు, సమీపంలోని జల పాతాలు, అరకులో యలోని అందాల ప్రదేశాలను సందర్శించారు. ఆంధ్రా ఊటీ అరకులోయ ఆది వారం పర్యాటకులతో కళకళలాడింది. సందర్శిత

... మిగతా 8వ పేజీలో


అరకులోయ : గాలికొండ వ్యూపాయింట్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

శాకంబరిగా మోదకొండమ్మ


పాడేరు మోదకొండమ్మ ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ, అర్చకులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.
- పాడేరురూరల్

గిరిజనుల కష్టాలెన్నో..!

గెడ్డలు దాటేందుకు సాహసాలు

- నిత్యావసర సరకుల కోసం తిప్పలు
- తాగునీటికి అవస్థలు
- వాగు దాటించ లేక కిడ్నీ రోగి మృతి

గత పది రోజులుగా పాడేరు మన్యంలో కురుస్తున్న వర్షాలకు గిరిజనులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే వాగులు, గెడ్డలు దాటేందుకు ఫీట్లు చేస్తున్నారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోవడంతో నిత్యావసర సరుకుల కోసం గిరిజనులు ఇతర గ్రామాలకు వెళుతున్నారు. అటువంటి సమయంలో గెడ్డలు దాటేందుకు సాహసం చేస్తున్నారు. కిలోమీటరు దూరం నుంచి తాగు నీటిని తీసుకువస్తున్నారు. గెడ్డ దాటించలేక కిడ్నీ రోగి మృత్యువాత పడ్డారు.

- గూడెంకొత్తవీధి/ముంచంగిపుట్టు/పెదబయలు/జి.మాడుగుల/చింతపల్లి


లక్ష్మీపురం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కల్వర్టు పైనుంచి కర్రల సాయంతో ద్విచక్ర వాహనాన్ని తీసుకువెళుతున్న దృశ్యం

గెడ్డ పొంగితే సాహసమే..

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం సమీపంలోని కల్వర్టుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిరిజనులు ఇతర గ్రామాలకు వెళ్లేటప్పుడు గుంపుగా ఒకరి చేతులు ఒకరు పట్టుకొని వెళుతున్నారు. అలాగే ద్విచక్ర వాహనాలను కర్రలకు కట్టి మోసుకొని వెళుతున్నారు.

చెట్టుపై ఫీట్లు


ఆదివారం చెట్టు కొమ్మల సాయంతో వాగు దాటుతున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: మండలంలోని అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధి గొళ్లపల్లి, తడ్డపల్లి గిరిజనులు వాగు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటేందుకు ఓ చెట్టును వాగుకు అడ్డంగా ఏర్పరచుకుని సాహసోపేతంగా రాకపోకలు సాగిస్తున్నారు. గత ఐదేళ్లుగా బ్రిడ్జి నిర్మించాలని వైసీపీ పాలకులకు అర్జీలు ఇచ్చినా ఏ ఒకరు పట్టించుకోలేదు.

పసుపు ఉడకపెట్టే పాత్ర సాయంతో..

పెదబయలు: మండలంలోని జామిగూడ గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో అవతల గ్రామాల ప్రజలు అష్టకష్టాలు పడి వాగు దాటుతున్నారు. రెండు రోజుల క్రితం ఆనప డిప్పల సాయంతో గెడ్డ దాటారు. ఆదివారం పసుపు ఉడక బెట్టే పాత్ర సహాయంతో గెడ్డ అవతల గల గిరిజనులు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును ప్రాణాలకు తెగించి దాటారు.


పసుపు ఉడక బెట్టే పాత్రతో గెడ్డ దాటుతున్న గిరిజనులు


కిలోమీటరు దూరంలో ఉన్న ఊటగెడ్డ నుంచి తాగునీటిని తీసుకువస్తున్న మహిళలు

గుక్కెడు నీటికి కిలోమీటరు వెళ్లాల్సిందే..

జి.మాడుగుల: మండలంలోని బొయితిలి పంచాయతీ దిగరాపల్లిలో తాగునీటికి మహిళలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో వేసిన బోరు మరమ్మతులకు గురి కావడంతో కిలోమీటరు దూరంలోని ఊటగెడ్డ నీటిని మహిళలు తెచ్చుకుంటున్నారు.

వైద్యం అందక కిడ్నీ రోగి మృతి


మృతి చెందిన కిడ్నీ బాధితుడు కృష్ణ

చింతపల్లి: మండలంలో అధిక వర్షా లకు ఎర్నాపల్లి వాగు దాటి వెళ్లి చికిత్స చేయించుకునే పరిస్థితి లేక కిడ్నీ రోగి మృతి చెందాడు. ఎర్రాపల్లి గ్రామానికి చెందిన పాడి కృష్ణ కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వారానికి రెండు సార్లు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకోవాలి. అయితే వర్షాలకు ఎర్నాపల్లి గ్రామానికి ముందు ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో డయాలిసిస్‌కు శుక్రవారం తీసుకువెళ్లలేకపోవడంతో శనివారం కృష్ణ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కుటుంబానికి రూ.3 వేలు పరిహారం

- ముంపు ప్రాంతాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక
- కలెక్టర్ దినేష్ కుమార్
- ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం
- తక్షణ చర్యలకు రూ. ఐదు కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

పాడేరు/చింతూరు, జూలై 28: వరద బారిన పడిన ప్రతి కుటుంబానికి రూ. మూడు వేలు నష్ట పరిహారం అందజేస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్. దినేశ్ కుమార్ తెలిపారు. ఆదివారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో 191 హాబిటేషన్లకు చెందిన 83,314 మంది వరద బారిన పడ్డారన్నారు. వరద బారిన పడిన ప్రతి కుటుంబానికి గతంలో రూ.రెండేసి వేలు వంతున ఆర్థిక సహకారం ఇచ్చామని, సీఎం చంద్రబాబు రూ.3వేలు వంతున పరిహారం చెల్లించాల్సిందిగా ఉత్వర్వులు జారీ చేశారన్నారు. ఇప్పటికే ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిరోసిన్, వంట నూనె, ఇతరత్రా నిత్యావసర వస్తువులను అందజేశామన్నారు.


ముంపు ప్రాంతాలకు బోటులో వెళుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

ఎవరికైనా బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందని పక్షంలో వెంటనే సమాచారం ఇవ్వాలని, వారికి వస్తువులను అందజేస్తామన్నారారు. ప్రతి గ్రామంలో సర్వే చేపట్టి ఇళ్ల డ్యామేజీతో పాటు పంట నష్టం వివరాలను సేకరించాలన్నారు. ముంపు ప్రాంతాల్లో సమగ్ర సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామన్నారు. ముంపుతో 54 రహదారులు ముంపులోనే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణ చర్యలకుగాను రూ.5కోట్లు విడుదల చేసిందని కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, పోలవరం ప్రత్యేక కలెక్టర్ సరళా వందనం పాల్గొన్నారు.


చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

- బాధితుల సహాయక, పునరావాస చర్యలపై ఆరా
- సంపూర్ణ సాయం అందాలని అధికారులకు ఆదేశం

- 8లో

ఏవోబీలో పోలీసులు అప్రమత్తం

అమరవీరుల వారోత్సవాలతో 24 గంటలు వాహన తనిఖీలు

- అనుమానితులపై ఆరా
- ప్రధాన రోడ్లపై బాంబు స్క్వాడ్ పరిశీలన
- సీలేరు మీదుగా వెళ్లే భద్రాచలం బస్సులు రద్దు
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రమేశ్, ప్రత్యేక పోలీసులు

పాడేరు/ చింతపల్లి/సీలేరు, జూలై 28: మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆదివారం నుంచి వారోత్సవాలు ప్రారంభం కావడంతో జిల్లాలో వాహనాల తనిఖీలను ముమ్మరంగా నిర్వహించారు. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే మార్గాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టులు ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడకుండా సరిహద్దుల్లో పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ జిల్లా పోలీసు యంత్రాంగానికి సూచించారు. ఏవోబీ ముఖద్వారమైన చింతపల్లి, జీకేవీధి మండలాల్లో పోలీసులు 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్ పర్యవేక్షణలో లంబసింగి, అన్నవరం, లోతుగెడ్డ, డిగ్రీ కళాశాల, హనుమాన్ జంక్షన్ల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అనుమానితులపై ఆరా తీస్తూ.. గుర్తింపు కార్డులను పరిశీలించి విడిచిపెడుతున్నారు. రహదారులు ఇరువైపులా కల్వర్టులు, బ్రిడ్జీల వద్ద బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేస్తున్నాయి. ఏవోబీ సరిహద్దుల్లో సీలేరు పోలీసుల గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆదివారం సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు అనుమానిత ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే, పోయే వాహనాలను తనిఖీ చేశారు. కొత్త వ్యక్తులపై ఆరా తీస్తూ గుర్తింపు కార్డులను పరిశీలించారు. అలాగే వారోత్సవాల నేపథ్యంలో సీలేరు మీదుగా భద్రాచలం తిరిగే నైట్ సర్వీస్ బస్సులను పీటీడీ అధికారులు రద్దు చేశారు. ఆదివారం నుంచి ఆగస్టు 3 వరకు సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నాలుగు బస్సులను రద్దు చేస్తున్నట్టు పీటీడీ అధికారులు తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తల్లడిల్లుతున్న తల్లీబిడ్డ పైలట్లు

- 7లో

బురదగుంట ఉరకలు


వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న బురదగుంట జలపాతం

ముంచంగిపుట్టు, జూలై 28: మండలంలోని జర్జుల పంచాయతీ బురదగుంట సమీపంలో జలపాతం వరద నీటితో ఉరకలేస్తోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చూపరులను ఆ జలపాతం ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఎత్తైన పెద్ద బండరాయిపై నుంచి ప్రవహిస్తున్న ఆ జలపాతాన్ని చూడాలంటే మండల కేంద్రం నుంచి ఆరు కిలోమీటర్లు వాహన ప్రయాణంతో పాటు ఒక కిలోమీటరు కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది.

రక్షిత ప్రదేశంలో రక్షణ కరువు!



రాజానగరంలో భవనం పరిస్థితి

భయపెడుతున్న తుఫాన్ రక్షిత భవనాలు

- వెంకటనగరం, రాజానగరంలలో దశాబ్దాల కిందట నిర్మాణం
- నేడు శిథిల స్థితికి చేరిక
- పాఠశాలలను ఆనుకుని ఉండడంతో గ్రామస్థులు భయాందోళన
- జరగరానిది జరగక ముందే అధికారులు స్పందించాలని వేడుకోలు



పెచ్చులూడి పడుతున్న శ్లాబ్

పాయకరావుపేట రూరల్, జూలై 28: ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలను సుర క్షిత భవనాలలోకి తరలించేందుకు నిర్మించిన తుఫాన్ రక్షిత భవనాలు పలు చోట్ల నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని నిర్వహణను పట్టించుకునే వారు లేకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని వెంకట నగరం పంచాయతీ పరిధిలో వెంకటనగరం, రాజానగరం గ్రామాల్లో దశాబ్దా ల కిందట నిర్మించిన ఈ భవనాలు నేడు ప్రమాదకరంగా మారాయి. పూర్తిగా శిథిలస్థితికి చేరుకున్నాయి. ఈ రెండు భవనాలు పాఠశాలల ఆవరణలో ఉండడంతో ఎప్పుడు కూలుతాయో, ఏప్రమాదం జరుగుతుందోనని ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు అటు ఉపాధ్యాయులు ఆందోళన చెం దుతున్నారు. తుఫాన్‌ల సమయాల్లో ప్రజలకు పునరావాసం కల్పించి వారికి ఆహారం అందజేసేందుకు గ్రామంలోని పాఠశాలలను ఉపయోగించుకుంటు న్నారు. అయితే వెంకటనగరంలోని పాఠశాలలో వర్షం ఎక్కువగా కురిస్తే నీరు చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తుఫాన్ సమయంలో ప్రజలకు భోజనాలు వండడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉన్న తుఫాన్ రక్షిత భవనం పునాదులు, పిల్లర్లు పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉంది. గజపతినగరం, పాల్మన్‌పేట, పెంటకోట, రత్న య్యమ్మపేట తదితర గ్రామాల్లో నూతనంగా తుఫాన్ రక్షిత భవనాలను నిర్మించినా, వెంకటనగరంలో మాత్రం కొత్త భవనాన్ని నిర్మించలేదు. శిథిలస్థితి లో ఉన్న ఈ భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన ప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. ఇదిలావుంటే, ఈ తుఫాన్ రక్షిత భవనాన్ని గతంలో గ్రామంలో బహుళ ప్రయోజనాలకు ఉపయోగించేవారు. ఇందులోనే పంచాయతీ కార్యాలయం, రేషన్ డిపో, అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించేవారు. ప్రస్తుతం భవనం శిథిలస్థితికి చేరు కుని కూలేందుకు సిద్ధంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



వెంకటనగరంలో పాఠశాల ఆవరణలో శిథిల స్థితికి చేరుకున్న రక్షిత భవనం



భవనం మెట్ల వద్ద దుస్థితి

బైక్ పైనుంచి జారిపడి మహిళ మృతి

కోటవురట్ల, జూలై 28 : బైక్ పైనుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమ ణయ్య తెలిపిన వివరాలివి. కొడవటిపూడి గ్రామానికి చెందిన తేటకాల రత్నం (36) కె.వెంకటాపురంలో గల జీడీపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఇద్దరు పిల్ల లను, భర్తను పోషించేది. మూడు నెలలు నుంచి ఫ్యాక్టరీ మూతపడింది. దీంతో ఆమె ఆదివారం తొమ్మిది గంటలకు కొడవటిపూడి గ్రామం నుంచి ఫ్యాక్ట రీకి పీఎఫ్ పనిపై బయల్దేరింది.అటుగా వస్తున్న అపరిచిత వ్యక్తి బైక్ ఆపి దానిపై వస్తుంది. ఇంతలో ఒక్కసారిగా జారిపడి ఆమె మృతి చెందింది. అయితే ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అం దుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంతకీ ఈమె ఎవరి బైక్ ఎక్కింది, ప్రమాదం ఎలా జరిగిందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

అదృశ్యమైన యువకుడు మృతి

కొయ్యూరు, జూలై 28: మండలంలోని శరభన్నపాలెం గ్రామానికి చెందిన రీముల జయవర్ధన్ అలియాస్ బాబి (22) మృతి చెందాడు. ఈ నెల 21వ తేదీన అదృశ్యమైన బాబి కత్తిరాలలొద్ది సమీప కొండవాగు ప్రవాహంలో గల్లంతైనట్టు భావించి శనివారం రాష్ట్ర విపత్తుల నిరోధక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం పి.మాకవరం గిరిజన సంక్షేమ బాలి కల ఆశ్రమ పాఠశాల వెనుక నుంచి ప్రవహిస్తున్న కొండవాగులో ఒక చెట్టు మొదలు వద్ద ఇసుకలో జయవర్ధన్ మృతదేహం లభ్యమైంది. కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణతో పాటు రెవెన్యూ సచివాలయ సిబ్బంది, కుటుంబీకులు గాలింపు చర్యలులు చేపట్టినా బాబి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం ఉదయం నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు మరోదఫా పి.మాక వరం-నడింపాలెం మధ్య కొండవాగు ప్రవాహ లలో గాలించగా జయవర్ధన్ మృతదేహం లభ్యమైంది. కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం తరలించారు. అంది వచ్చిన ఒక్కగానొక్క కొడుకు అదృశ్యమైన వారం రోజుల అనంతరం మృతి చెంది కనిపించడంతో తల్లిండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

అధికారుల నిర్లక్ష్యంతో మునిసిపాలిటీ ఆదాయానికి గండి

- పట్టణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఖాళీగా ఉన్న దుకాణాలు
- ఏళ్ల తరబడి కోల్పోతున్న ఆదాయం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మించిన మునిసిపల్ దుకాణ సముదాయంలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న కొన్ని దుకాణాలు

ఎలమంచిలి, జూలై 28: అధికారుల నిర్లక్ష్యంతో మునిసి పాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. పట్టణంలోని మునిసిపల్ దుకాణ సముదాయాల్లో కొన్ని దుకాణాలు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో మునిసి పాలిటీ ఆదాయాన్ని కోల్పోతోంది. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. ముని సిపాలిటీ దుకాణ సముదాయాల్లో కొన్ని దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వీటికి నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఫలితంగా వేలా ది రూపాయలు మునిసిపల్ ఆదాయానికి గండి పడుతోంది. దుకాణాలు నిరుప యోగంగా ఉంటున్నా.. అధికారులు గానీ, పాలకులు గానీ దృష్టి సారించడం లేదు. మునిసిపల్ కార్యాలయానికి చెంతనే పంచాయతీగా ఉన్న సమయంలో పీవీ కాం ప్లెక్సు పేరిట దుకాణ సముదాయాన్ని నిర్మించారు. ఈ దుకాణ సముదాయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని 14 దుకాణాల నుంచి అద్దె వస్తున్నది. రెండో అంతస్తు సగ భాగంలో గ్రామ సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మరి కొంతభా గంలో ఉన్న దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో మునిసిపల్ ఆదాయానికి గండి పడుతోంది. ఈ సముదాయంపై పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా బస్టాండ్ సమీపంలో మునిసిపల్ దుకాణ సముదాయాన్ని నిర్మించారు. వీటిలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణాలు అద్దెకు ఇచ్చినా.. పైఅంతస్తులో కొన్ని దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వీటిలో కొన్ని దుకాణాల్లో మునిసిపల్ వస్తు సామగ్రి ని భద్రపరిచారు. మిగిలిన దుకాణాలను చిరువ్యాపారులకు కేటాయించాలని పలువురు సూచిస్తున్నారు. మునిసిపల్ ఆదాయ వనరులను పెంచే దిశగా పాలకు లు, అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే మునిసిపాలిటీ ఆదాయం పెరుగుతుందని పలువురు కోరుతున్నారు.

పాల్తేరుకు 'పుష్కర' నీరు అందించాలి

- 'యనమల'కు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి విజ్ఞప్తి



యనమల రామకృష్ణుడుకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట, జూలై 28: మండలంలోని పాల్తేరు గ్రామంలో గల వ్యవ సాయ భూములకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పుష్కర ఎత్తిపోతల కాల్వ నీరు అందించి ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరు లు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడికు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం చిట్టిబాబు ఆధ్వర్యంలో పాల్తేరు పంచాయతీ పాలకవర్గంతో పా టు పలువురు రైతులు తుని పట్టణంలో యనమల రామకృష్ణుడిని కలిసి వినతిప త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ పాల్తేరు పక్కనే ఉ న్న వల్లూరు గ్రామం వరకు పుష్కర ఎత్తిపోతల కాల్వ ద్వారా వస్తున్న గోదావరి నీటిని పాయకరావుపేట మండలంలోని పాల్తేరు చెరువులకు అనుసంధానం చేస్తే పాల్తేరు రెవెన్యూ పరిధిలోని వెయ్యి ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందుతుందన్నారు. ఎస్.నర్సాపురం, శ్రీరాంపురం, కుమారపురం తదిత గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవవరపు రాజబాబుతో పాటు పాల్తేరు సర్పంచ్ గోసల కృష్ణ, బుద్దాల శ్రీను, వెంకటసూరి తదితరులు పాల్గొన్నారు.

కిరండోల్ రైలు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, జూలై 28: భద్రతా కారణాల దృష్ట్యా విశాఖ, కిరండోల్ మధ్య నడిచే ప్రత్యేక పాసింజర్ రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం కే సందీ ప్ తెలిపారు. దీంతో 08551 నంబరు గల విశాఖ-కిరండోల్ రైలు ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని 08552 నంబరు గల కిరండోల్ - విశాఖ రైలు ఈనెల 29 నుంచి ఆగస్టు ఒకటి వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

తల్లడిల్లుతున్న తల్లీబిడ్డ పైలట్లు

మూడు నెలలుగా అందని వేతనాలు

- ఇచ్చేదే అరకొర.. అదీ సక్రమంగా అందని పరిస్థితి
- డేటా ఎంట్రీ విధులు అదనం
- నెట్ డేటా కోసం జేబుకు చిల్లు



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో బాలింతను తరలిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జూలై 28:

ఇచ్చేవే అరకొర వేతనాలు.. అవి కూడా సక్రమంగా ఇవ్వడం లేదు.. దీంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది తల్లడిల్లిపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులు వేధిస్తుండడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 2015, డిసెంబరు 31న తల్లీబిడ్డ ఎ క్స్‌ప్రెస్‌లను రాష్ట్రంలో ప్రవేశ పెట్టారు. గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రసవం తర్వాత తల్లిని, బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చడానికి ప్రత్యేకంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో 30కి పైగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. డ్రైవింగ్ లై సెన్స్, పదో తరగతి అర్హత ఉన్న వారిని ప్రతి వాహనానికి ఒక పైలట్ (డ్రైవరు)ను నియమించారు. 108, 104 సర్వీసులను నిర్వహిస్తున్న అర బిందో కంపెనీయే ఈ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను కూడా నిర్వ హిస్తోంది. పైలట్ జీతం రూ.8,800లు కాగా కటింగ్‌లు రూ.930లు పోను రూ.7,870లు చేతికి ఇస్తున్నారు. అయితే గత మూడు నెలలుగా జీతాలు అందక దుర్భర జీవితం అనుభవిస్తున్నామని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి ప్రతి నెలా అప్పులు చేసి వడ్డీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని వాపోతున్నారు. యాజమాన్యం కట్టాల్సిన పీఎఫ్ వాటా ని కూడా సిబ్బంది జీతం నుంచి జమ చేసుకుంటున్నారని సిబ్బంది అంటున్నారు. కార్మిక చట్టం ప్రకారం యాజమాన్యం వాటా 50 శాతం, ఉద్యోగి జీతం నుంచి 50 శాతం కలిపి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకి జమ చేయాలి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పైలట్ల విషయంలో యాజమాన్యం వాటా కూడా సిబ్బంది జీతం నుంచి జమ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ నమోదు చేయడానికి సెల్‌ఫోన్లు ఇవ్వకుండా కేవలం సిమ్‌కార్డు లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అయితే ఇంటర్‌నెట్ వాడకానికి కంపెనీ ఇచ్చిన సిమ్ కార్డులు పని చేయడం లేదని, ఇందుకో సం ప్రతి నెలా రీచార్జ్ చేసుకోవాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. నెట్ సౌకర్యం ఉంటే గాని డేటా ఆన్‌లైన్ చేయడం వీలుపడదని అంటు న్నారు. పైలట్ ఉద్యోగంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం కూ డా చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అరకొర జీతం నుంచి నెట్ బ్యాలెన్స్ రీచార్జ్ చేసుకొని బాలింతలు, గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నామని అంటున్నారు. మూడు నెలల జీతాలు బకాయిలు తక్షణమే విడుదల చేసి, ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చే విధంగా అధికా రులు చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరుతున్నారు.

దేవదాయ భూముల ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం నాయకులు డిమాండ్

అనకాపల్లి టౌన్, జూలై 28: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో ఉన్న దేవదాయశాఖ భూములను ఆక్రమించేందుకు ప్రయ త్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరా వు డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో సీతారామచంద్రస్వామి (అంబికాబాగ్) భూములు ఉన్నాయన్నారు. దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ భూములను కొంతమంది ఆక్రమించడానికి ప్రయత్నించినట్టు ఆరోపించారు. భూముల పరిరక్షణకు చుట్టూ కంచె వేసి, సెక్యూరిటీని కూడా దేవదాయశాఖ ఏర్పాటు చేసిందన్నారు. అయినప్పటికీ పట్టపగలు శనివారం కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వచ్చి సదరు కంచెను తొల గించి, చదును చేయడం తగదన్నారు. దీనిపై సోమవారం కలెక్టరేట్ వ ద్ద ఆందోళన చేపట్టనున్నట్టు చెప్పారు. భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్

పెద్దేరు రాచకట్టు కాలువకు నీరు విడుదల

మాడుగుల రూరల్, జూలై 28: మండలంలోని రావిపాలెం పెద్దే రు జలాశయం రాచకట్టు కాలువ నీటిని ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి విడిచిపెట్టారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో మాడుగు ల మండలం రాచకట్టు కాలువ ఆయకట్టు రైతులు సాగు చేసే పంటల కు జలాశయం నీటిని విడిచిపెడుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం జ లాశయం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజ చేసి గేటు ఎత్తి నీటిని ఎమ్మెల్యే బండారు విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు నీటి సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పెద్దేరు జలాశయంలో పుష్కలంగా నీరు ఉందని, వ ర్షాలు పడటంతో గరిష్ఠ స్థాయికి చేరువైందని చెప్పారు. అనంతరం ఆ యన మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆల య కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆయనను సాదరంగా ఆహ్వా నించారు. కేజేపురం మోదకొండమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను బండారు ఆ విష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్ సోదరుడు సురేశ్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, గవిరెడ్డి రా మానాయుడు, పీవీజీ కుమార్, పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారా వు, ఉండూరు దేముడు, ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, పుప్పాల రమేశ్ తదితర కూటమి నాయకులు, జలాశయం అధికారులు పాల్గొన్నారు.



పెద్దేరు జలాశయం నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎమ్మెల్యే బండారు

విద్యుత్ సిబ్బందికి రైతుల ప్రశంసలు

ప్రతికూల పరిస్థితుల్లోనూ విద్యుత్ పునరుద్ధరణ



లైన్‌మన్ సాయిని వీపుపై మోసుకొని స్తంభం వద్దకు తీసుకెళుతున్న సహాయకుడు కొండబాబు

బుచ్చెయ్యపేట, జూలై 28: ప్రతికూల పరిస్థితుల్లో సైతం విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేసిన లైన్‌మన్, అతడి సహాయకుడిని రైతులు అభినంది స్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. వర్షాలకు వడ్డాదిలో కోవెల అయ్యన్న రఘుకి చెందిన మోటారుకు సరఫరా అవుతున్న మెయిన్ విద్యుత్ వైర్లు కిందకు పడిపోయాయి. దీంతో 20 ఎకరాలకు విద్యుత్ సరఫరా ని లిచిపోయింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న లైన్‌మన్ సాయి, సహాయకుడు కొండబాబు ఆదివారం పొలం వద్దకు చేరు కున్నారు. పొలంలో నిండా నీరు ఉంది. వైర్లు వర్షం నీటిలో పడిపోయి ఉండడం గమనించారు. నీటిలో కాళ్లు తడిస్తే విద్యుత్ స్తంభం పైకి ఎక్కడానికి ఇబ్బందిగా అవుతుందని గుర్తించారు. దీంతో సాయిని కాళ్లు తడవకుండా సహాయకుడు కొండబాబు తన వీపుపై ఎక్కించుకొని పొలంలో నడుస్తూ విద్యుత్ స్తంభం వద్దకు తీసుకెళ్లారు. కొండబాబు వీపుపై నుంచి సాయి స్తంభం ఎక్కాడు. అనంతరం కొండబాబు పొలంలో పడిపోయిన విద్యుత్ తీగలు తాడు సహాయంతో లైన్‌మన్‌కు అందించాడు. దీంతో మెయిన్‌లైన్ వైర్లను బిగించి, నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో లైన్‌మెన్ సాయి, సహాయకుడు చూపిన చొరవకు అభినందనలు కురిపించారు.

శాకంబరి అలంకరణలో నూకాంబిక అమ్మవారు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం





ఆలయంలో క్యూలైన్‌లో ఉన్న భక్తులు (అంతర్ చిత్రం) అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూలై 28 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకం బరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అర్చకులు సర్వాంగ సుందరంగా అలంక రించారు. సెలవు దినం కావడంతో అమ్మ దర్శనానికి అనకాపల్లితో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో కోలాహల వాతావరణం నెల కొంది. పలువురు కుటుంబాలతో సహా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొంద రు అమ్మవారి పండగను చేసుకుని ఘటాలను ఆలయానికి తీసుకు వచ్చి సమర్పిం చారు. ప్రముఖ వ్యాపారవేత్త మళ్ల జగ్గఅప్పారావు కూరగాయలను సమకూర్చారు. భ క్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వ ర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు.

తాండవలో పెరుగుతున్న నీటి నిల్వలు

- ఆయకట్టు రైతుల ఆనందం



తాండవలో 372 అడుగులకు చేరుకున్న నీటి నిల్వలు

నాతవరం,జూలై 28: తాండవ రిజర్వాయర్‌లో రోజురోజుకూ నీటినిల్వలు పెరుగుతుండటంతో ఆయ కట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 372 అడుగు లకు నీటినిల్వలు చేరుకున్నాయి. ఇన్‌ఫ్లో ద్వారా తాండవ ఎగువ ప్రాంతాల నుంచి 500 క్యూసెక్కుల నీరు వస్తోందని తాండవ డీఈ అనురాధ తెలిపారు. గత ఏడాది తాండవలో జూలై 28 నాటికి 369 అడుగుల నీటినిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ పదిరోజుల్లో నీటి నిల్వలు బాగా పెరిగాయని డీఈ తెలిపారు. ఇదే విధంగా వర్షాలు పడితే ఆగస్టు 15న నీరు విడుదల చేసేలోపు తాండవలో మరింత నీటినిల్వలు పెరిగే అవకాశం ఉందని డీఈ అనురాధ పేర్కొన్నారు.

కోనాం జలాశయంలో వృథాగా పోతున్న నీరు

- రైతులు ఆవేదన



మెయిన్‌గేట్ల ద్వారా వృథాగా పోతున్న సాగునీరు

చీడికాడ, జూలై 28: మండలంలో కోనాంలో ఉన్న జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న సాగునీరు తక్కు వగా ఉండగా, జలాశయం మెయిన్‌గేట్లు, దిగువ కాలువ ద్వారా ఎక్కువ సాగు నీరు వృథాగా పోతుండటంతో ఎగువ కాలువ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం ఉదయానికి 99.40 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 30 క్యూసెక్కులు కాగా.., ఎగువ, దిగువ గేట్లు ద్వారా 150 క్యూసెక్కులకు పైగా సాగునీరు వృథాగా పోతోంది. ఈ దుస్థితి గత 20 రోజులుగా ఏర్పడిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణులకు వైద్య సేవలు నిలిచినా పట్టించుకోరా?

- జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుల డిప్యుటేషన్ రద్దుచేయాలి
- ఆదివాసీలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు
- అసంపూర్తి పనులతో జల్‌జీవన్ మిషన్ పథకం ఫెయిల్
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోరాబు అనుషదేవి... 'ఆంధ్రజ్యోతి' కథనాలను చూపిస్తూ వైద్యుల తీరుపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ సునీల్

చింతపల్లి, జూలై 28: ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య సేవలు నిలిచిపోయినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. వైద్య శాఖ చర్చపై లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ 'ఆంధ్రజ్యోతి' కథనాలను ప్రదర్శిస్తూ చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో 20 రోజులుగా గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు, ఆరోగ్య తనిఖీలు నిలిచిపోయాయని, ఒక గైనికాలజిస్టు సెలవుపై వెళ్లిపోగా, మరో ఇద్దరు వైసీపీ ప్రభుత్వ నాయకులతో పైరవీలు చేసుకుని పాడేరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఒక్క గైనికాలజిస్టు కూడా లేరన్నారు. జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుల డిప్యుటేషన్ రద్దు చేయాలన్నారు. జనరల్ సర్జన్ వైద్యాధికారి వారానికి ఒకరోజు మాత్రమే విధులకు హాజరవుతున్నారని, ఎనస్థీషియా వైద్యులు కొన్ని నెలలుగా విధులకు రావడం లేదని చన్నారు. గ్రామాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చిన గర్భిణులు, రోగులను నర్సీపట్నం, పాడేరు, కేజీహెచ్‌కి రిఫరల్ చేసి వైద్యులు చేతులు దులుపుకుంటున్నారన్నారు. రెండు మండలాలకు పెద్దదిక్కైన ఏరియా ఆస్పత్రిలో ఆదివాసీలకు వైద్యసేవలు అందడంలేదని, వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికి జిల్లా అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని, గిరిజనుల ఆరోగ్యంపై అధికారులకు ఇంత చిన్నచూపా అని ఆయన ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పేందుకు వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఎంపీపీ అనుషదేవి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, తాజంగి, లంబసింగి, కోరుకొండ, లోతుగెడ్డ పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు సభకు హాజరుకాకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోను ఎంపీపీ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చర్చపై చింతపల్లి మండల కేంద్రంలో నీటి సరఫరా జరగక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారమల్లేశ్వరి ప్రస్తావించారు. ఆరు నెలలుగా రెవెన్యూ కార్యాలయానికి మంచి నీరు సరఫరా చేయాలని కోరినప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. తాజంగి పంచాయతీ కేంద్రంలో జల్‌జీవన్ మిషన్ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని, ఇంటింటి కొళాయి అని చెప్పినప్పటికీ కొందరికి మాత్రమే ట్యాప్‌లు ఏర్పాటు చేశారని సర్పంచ్ మహేశ్వరి అసహనం వ్యక్తం చేశారు. తోటమామిడి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులు ఆదివాసీలు శ్రమదానంతో చేసుకోవాలని కాంట్రాక్టర్ చెబుతున్నారని గొందిపాకలు ఎంపీటీసీ సభ్యుడు తాంబేలి మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ జోక్యం చేసుకుని మండలంలో జల్‌జీవన్ మిషన్ పనులు ఫెయిల్ అయ్యాయని, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడా పనులు పూర్తికాలేదని చెప్పారు. దీనికి డీఈఈ రుక్మాంగదరావు సమాధానం ఇస్తూ చింతపల్లిలో పూర్తి స్థాయిలో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని, 20 రోజుల్లో తాజంగి పంచాయతీలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ చర్చలో 2023-24 ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రావెల్ రోడ్లు ఒకే కాంట్రాక్టర్‌కి కట్టబెట్టడం వెనుక ఎవరి హస్తం ఉందని, ఈ పనులు ఎందుకు పూర్తి చేయడంలేదని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ప్రశ్నించారు. టీడబ్ల్యూ డీఈఈ చాణిక్యరావు సమాధానం ఇస్తూ గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల పనులు ముందుకు సాగలేదన్నారు. నూతన ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పనులు ప్రారంభిస్తామన్నారు. విద్యా శాఖపై జరిగిన చర్చలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలేదని, నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారని, పదో తరగతి చదివిన విద్యార్థికి అక్షరాలు రావడంలేదని, మాస్ కాపీయింగ్ చేయించి విద్యార్థులను పాస్ చేయించడం వల్ల ఉన్నత విద్యలో రాణించలేకపోతున్నారని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. రాజేంద్రపురం ప్రభుత్వ పాఠశాలలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు బలవంతంగా టీసీలు ఇచ్చేస్తున్నారని తాజంగి సర్పంచ్ తెలిపారు. దీనిపై ఎంఈవో ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోయినా, విధులకు గైర్హాజరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గంజాయి నిర్మూలనకు సహకరిస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులతో తహసీల్దార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వీరసాయిబాబు, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో తగ్గిన వాన!

- చింతూరు ప్రాంతంలో ముంపు, పాడేరు డివిజన్‌లో గెడ్డల ఉధృతి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, అధికార యంత్రాంగం

పాడేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సుమారు పది రోజుల తర్వాత ఎట్టకేలకు ఆదివారం వర్షం తగ్గింది. ముసురు వాతావరణం కొనసాగుతున్నప్పటికీ భారీ వర్షం, ఈదురు గాలులు వంటి సమస్య లేదు. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చింతూరు డివిజన్ పరిధిలో అనేక గ్రామాలు ముంపులో ఉండగా, పాడేరు డివిజన్ పరిధిలోని గెడ్డల ఉధృతి కొనసాగుతున్నది.

తగ్గని గెడ్డల ఉధృతి...

జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ గెడ్డలు, వాగులు ఆదివారం ఉధృతంగానే పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గెడ్డలకు అవతల ఉన్న గ్రామాలకు చెందిన గిరిజనులు ఊళ్లకే పరిమితమయ్యారు. అలాగే చింతూరు డివిజన్ పరిధిలో పదుల సంఖ్యలో గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. దీంతో బాధితులు పునరావాస కేంద్రాలు, తాత్కాలిక నివాసాల్లోనే ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ చింతూరు, కూనవరం, వీఆర్.పురం, ఏటపాక మండలాల్లో అధికార యంత్రాంగం చేపడుతున్న వరద సహాయక, పునరావస చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ధారాలమ్మ ఘాట్ రోడ్డులో కూలిన వృక్షం

సీలేరు, జూలై 28: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ ఘాట్ రోడ్డులో ఆదివారం చెట్టు కూలిపోయింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధారాలమ్మ ఆలయం దిగువన రెండో మలుపు వద్ద శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి ఆదివారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో చెట్టు పడిపోయింది. దీంతో సీలేరు నుంచి నర్సీపట్నం వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్‌తో చెట్టును తొలగించి ఉదయం 11 గంటలకు రాకపోకలను పునరుద్ధరించారు.

అతిసారతో మూడేళ్ల చిన్నారి మృతి


స్పందన (ఫైల్)

సీలేరు, జూలై 28: ధారకొండ పీహెచ్‌సీ పరిధిలో మూడేళ్ల చిన్నారి అతిసారతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. ధారకొండ పంచాయతీలోని కమ్మరితోట గ్రామానికి చెందిన రెడ్డి బాబూరావు, నీలమ్మ దంపతుల మూడేళ్ల కుమార్తె స్పందనకు శనివారం రాత్రి నుంచి వాంతులు, విరోచనాలు కావడం, రాత్రి విపరీతంగా వర్షం కురుస్తుండంతో వైద్యం కోసం తెల్లవారుజామును ధారకొండ పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే పాప పరిస్థితి విషమంగా మారడంతో వైద్యాధికారి సేవలు అందించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రాత్రి సమయంలోనే ఆసుపత్రికి తీసుకువచ్చి ఉంటే చిన్నారి ప్రాణాలు దక్కేవని వైద్యాధికారి డీకె హిమబిందు తెలిపారు.

భారీ వర్షాలతో మూగజీవాలు మృతి


జర్జులలో మృతి చెందిన మూగజీవాలు

ముంచంగిపుట్టు, జూలై 28: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా పలు గ్రామాల్లో మూజీవాలు మృతి చెందాయి. వేలాది రూపాయలు విలువ చేసే మూగజీవాలు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయామని బాధితులు వాపోతున్నారు. జర్జుల గ్రామంలో కొండబాబుకు చెందిన ఒక ఆవు, కె.లోకినాథ్‌కు చెందిన రెండు దుక్కిటెద్దులు, జబడ గ్రామంలో కె.ధనుర్జయ్‌కు చెందిన దుక్కిటెద్దు, రంగినిగూడలో కె.లైచోన్‌కు చెందిన ఒక ఆవు మృతి చెందాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. అలాగే మండలంలోని సుజనపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి మధ్యలో కల్వర్టు కూలిపోయింది. రహదారి కోతకు గురైంది. దీంతో అటుగా వాహన రాకపోకలు స్తంభించిపోయాయి. అధికారులు స్పందించి మరమ్మతు పనులు జరిగే విధంగా చూడాలని సర్పంచ్ వి.రమేష్ కోరారు.

ఆట్టుకుంటున్న కొల్లాపుట్ జలపాతం

డుంబ్రిగుడ, జూలై 28: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్ జలపాతం ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నది. ఆ జలపాతంలో ఎప్పుడూ ఒక మోస్తరుగా మాత్రమే నీరుంటుంది. కాని గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలప్రవాహం అధికం కావడంతో చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో స్థానికులు అక్కడి వెళ్లి ఆస్వాదిస్తున్నారు.


జలపాతంలో యువలకు సందడి

పర్యాటకం కళకళ..

... 5వ పేజీ తరువాయి

ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన గిరిజన మ్యూజి యం, పద్మాపురం గార్డెన్, గాలికొండ వ్యూపాయింట్, రణజిల్లెడ జలపాతం పర్యాటకులతో కళకళలాడాయి. శని, ఆదివారం నుంచి పర్యాటకులు పోటెత్తారు. పర్యాటకులు రాకతో అరకు-విశాఖ ప్రధాన రహదారి, అనంతగిరి ఘాట్‌రోడ్డు రద్దీగా మారింది. అనంతగిరి మండలం బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. దేశ విదేశాల నుంచి వచ్చిన రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారు గుహలను తిలకించారు. ఈనెల 21వ తేదీ ఆదివారం బొర్రా గుహలను 1,449 మంది, 22వ తేదీన 821 మంది, 23వ తేదీన 568 మంది, 24వ తేదీన 538 మంది, 25వ తేదీన 711 మంది, 26వ తేదీన 712 మంది, 27వ తేదీన 1,565 మంది సందర్శించారు. ఆదివారం (28వ తేదీ) 1,900 మంది గుహలను సందర్శించగా రూ.1.54 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న పాడేరు, అరకు ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరావు, మత్స్యలింగం, మజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి.. భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

శాకంబరిగా మోదకొండమ్మ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

పాడేరు రూరల్, జూలై 28: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాకంబరి మహోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం అమ్మవారి శాకంబరి మహోత్సవం, అదే విధంగా ప్రతీ ఆదివారం అమ్మవారి దర్శనం, మొక్కులు చెల్లించుకొనేందుకు మన్యం, మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళకళలాడింది. శాకంబరిగా దర్శనమిచ్చిన మోదకొండమ్మను దర్శించుకొనేందుకు వందలాది మంది భక్తులు క్యూకట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వరస్వామి, శివలింగంలను ఏర్పాటు చేసి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రతినిధులు కిల్లు కోటిబాబు, టి.ప్రసాద్‌నాయుడు, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, చాపురు రమాదేవి, కమిటీ చైర్మన్ కొట్టగుళ్లి రామారావు, డాక్టర్ తమర్బ నరసింగరావు, కె.సురేష్‌కుమార్, వంతినిభ రాజబాబు, కె.సతీష్, ఎస్.శ్రీనివాస్‌కుమార్, ఎస్.కొండలరావు, బీవీఎస్.ముకుంద రావు, సల్లా రామకృష్ణ, సూర్యనారాయణ, నాగు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ పర్యటన

- బాధితుల సహాయక, పునరావస చర్యలపై ఆరా
- సంపూర్ణ సహాయం అందించాలని అధికారులకు ఆదేశం


తాళ్లగూడెంలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం మండలాల్లో వరద ముంపు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదివారం పర్యటించారు. చింతూరు మండలం గొల్లగుప్ప, వీరపురం, కూనవరం మండలంలో భద్రాయగూడెం, తాళ్లగూడెం గ్రామాలను సందర్శించి ఆయా ప్రాంతాల్లో బాధితులకు అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రస్తుతం భద్రాయగూడెం, తాళ్లగూడెం గ్రామాలు నీటి మునిగి ఉండడంతో బోటులో ప్రయాణించి వరద బాధితుల వద్దకు చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో వరద బాధితులకు అందుతున్న సహాయం, తదితర సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు అందించిన సరకులు, ఇతర సామగ్రిని పరిశీలించి, అధికారుల సేవలపై ఆరా తీశారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే అన్ని ప్రాంతాల్లోని బాధితులకు సంపూర్ణ సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బందిని నియమించామని, ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వరదలు తగ్గుతుప్పటికీ ముంపు ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ఆయా ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ముందు గ్రామాల్లోని తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న వారిని పలకరించి సహాయంపై ఆరా తీస్తూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. అదే ప్రాంతంలో ఓ బాధిత కుటుంబం ఏర్పాటు చేసుకుంటున్న తాత్కాలిక నివాసాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ముంపు ప్రాంతాల్లో అవసరాలకు వినియోగించుకునే బోట్లు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజలకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్‌గనోరే, కావూరి చైతన్య, తహసీల్దార్ నజీముల్లా, సీడీపీవో గౌరి, ఎంపీడీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేలను పరిశీలించిన మాజీ మంత్రి శ్రావణ్


కితలంగి కాజ్‌వేను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్

డుంబ్రిగుడ, జూలై 28: మండలంలో వర్షాలతో కొట్టుకుపోయిన కాజ్‌వేలను మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. అలాగే ఆస్తి, పంట నష్టాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలతో ఆస్తి, పంటలు, ప్రధాన రహదారులు నష్టపోయామన్నారు. ప్రధాన రహదారులు కొట్టుకుపోవడంతో రాకపోకలకు వీలు లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు కోల్పోయిన గిరిజన కుటుంబాలకు గృహాలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కితలంగి కాజ్‌వే పునరుద్ధరణకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని గిరిజన సంక్షేమశాఖ ఈఈని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ కోశాధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కమ్మిడి సుబ్బారావు, సర్పంచ్ పాండురంగస్వామి, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, ఎంపీటీసీ సభ్యురాలు గీత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భాస్కరరావు, నాయకులు చినగెన్ను, సింహాద్రి, బొంజుబాబు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సరకుల తరలింపునకు అంగన్‌వాడీల అవస్థలు


సరకులను మోసుకు వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు

కొయ్యూరు, జూలై 28: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే సరకులను కాంట్రాక్టు తమకు అనువైన చోట దించేస్తుండడంతో అంగన్‌వాడీలు అవస్థలు పడుతున్నారు. ఈ సరకులను చేతిచమురు వదిలించుకుని కేంద్రాలకు తరలించుకునే పరిస్థితులు నెలకొంటున్నాయి. కొండలపై గల అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న వివిధ సరకులు రవాణాకు కాంట్రాక్టు ఇచ్చి కేంద్రాలకు సరఫరా చేసేలా అధికారులు నిర్ణయించారు. కిలోమీటరుకు నిర్దేశించిన రేటును కాంట్రాక్టరుకు చెల్లింపులు చేస్తారు. అయితే కొండలపై గల కేంద్రాలకు సరైన రహదారి సౌకర్యం లేదనే కుంటుసాకుతో కాంట్రాక్టరు పది నుంచి 20 కిలోమీటర్లు దూరంలో గల కేంద్రాల వద్ద మిగిలిన కేంద్రాల సరకులు దింపి చేతులు దులుపుకుంటున్నాడు. దీంతో ఆయా కేంద్రాల కార్యకర్తలు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చేతిచమురుతో వేరొక వాహనం ఏర్పాటు చేసుకుని కేంద్రాలకు తీసుకువెళుతున్నారు. అంతేకాకుండా వందలాది రూపాయలు జీతాల నుంచి సరకులు మోసుకువెళ్లిన వారికి చెల్లించాల్సి వస్తుంది.

మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధిలో గల చీడిపాలెం, పోకలపాలెం, గోదుమలంక అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన సరకులను వర్షాల నెపంతో రహదారి బాగోలేదని కాంట్రాక్టరు బాలరేవుల అంగన్‌వాడీ కేంద్రం వద్ద దించాడు. దీంతో ఆ మూడు కేంద్రాల కార్యకర్తలు ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటు చేసుకుని కేంద్రాలకు తరలిస్తుండగా పోకలపాలెం-చీడిపల్లి మధ్య వాహనం మరమ్మతులకు గురైంది. అలాగే గోదుమలంక కేంద్రానికి సరకులు తీసుకువెళుతున్న వాహనం బురదలో కూరుకుపోయింది దీంతో గత్యంతరం లేక ఈ మూడు కేంద్రాల సిబ్బంది శ్రమకోర్చి మోసుకుంటు కేంద్రాలకుతీసుకువెళ్లారు. కేంద్రాల వద్దకే సరకులు సరఫరా చేసేందుకు వీలుగా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లింపులు చేస్తున్నా సగం దారికే తెచ్చి వదిలివెళుతుండడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, నేరుగా కేంద్రాలకు సరకులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని అంగన్వఆడీ కార్యకర్తలు కోరుతున్నారు.

ఈ విషయమై సీడీపీవో విజయలక్ష్మిని వివరణ కోరగా, ఏజెన్సీ వ్యాప్తంగా మారుమూల కొండలపై గల కేంద్రాలకు సరకులు రవాణా విషయమై ఈ సమస్య ఉందన్నారు. దీనిపై కలెక్టర్‌కు విన్నవించామన్నారు. రహదారి సౌకర్యం లేని సెంటర్లకు సమీప కేంద్రం నుంచి సరకులు తీసుకు వెళ్లేందుకయ్యే ఖర్చు సంబంధిత కాంట్రాక్టరు ద్వారా కార్యకర్తలకు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారని, ఈ సమస్య కలెక్టర్ చొరవతో త్వరలో పరిష్కారమవుతుందని సీడీపీవో తెలిపారు.

సంక్షిప్తంగా..

ఘాట్‌లో రాకపోకల నిషేధం పక్కాగా అమలుచేయండి

- జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని రోజులుగా వర్షాలు అధికంగా కురిసినందున ఘాట్ మార్గాల్లో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకల నిషేధాన్ని అధికారులు మరికొన్ని రోజులు పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఘాట్ మార్గాల్లో కొండచరియలు, వృక్షాలు పడే ప్రమాద ఉందని, ఈ నేపథ్యంలో రాత్రుళ్లు రాకపోకలు నిలిపేయాలని ఆయన స్పష్టం చేశారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు సాయంత్రం 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోలకు అనుమతించకూడదని అధికారులకు ఆదేశించారు.

డొంకరాయి జలాశయంలో 13124 క్యూసెక్కుల విడుదల

సీలేరు, జూలై 28: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయానికి వరద నీటి తాకిడి మరింత పెరగడంతో 13124 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం తెల్లవారున మూడున్నర గంటల నుంచి జలాశయానికి వరదతాకిడి తగ్గడంతో నీటి మట్టం 1035.5 అడుగులకు తగ్గుతముఖం పట్టడంతో జెన్‌కో అధికారులు గమనించి నీటి విడుదలను 6, 7, 8 గేట్లను నాలుగు అడుగుల నుంచి మూడు అడుగులకు తగ్గించి 13124 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం సీలేరు కాంప్లెక్సు జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు జలాశయం వద్దకు చేరుకుని నాలుగు గేట్ల ద్వారా దిగువకు నీరు విడుదల అవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు వరదనీటి తాకిడి అధికంగా ఉండడంతో 16679 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశామన్నారు. అయితే తెల్లవారుజామును నుంచి వరదనీటి తాకిడి తగ్గిందని, దీంతో నీటి విడుదలను 13124 క్యూసెక్కులకు తగ్గించామన్నారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు, డొంకరాయిలో 15080 మెటావాట్లు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 300 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని సీఈ వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో డొంకరాయి ఈఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ట్యూషన్ ఫీజు గడువు పెంపు

పాడేరు రూరల్, జూలై 28: బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఆగస్టు 18వ తేదీ వరకు గడువు పెంచినట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం 128 ద్వారా బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ బీఏ, బీకాం కోర్సులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ద్వితీయ, తృతీయ సంవత్సర ట్యూషన్ ఫీజు, ల్యాబ్ ఫీజులును 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరిన విద్యార్థినీ, విద్యార్థులు, తృతీయ, ద్వితీయ సంవత్సర ట్యూషన్ ఫీజులు ఆగస్టు 18వ తేదీలోగా యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల అధ్యయన కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఉద్యాన సహాయకుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక


పాడేరు రూరల్, జూలై 28: అల్లూరి సీతారామ రాజు జిల్లా ఉద్యాన సహాయకుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన ఉద్యాన సహాయకుల సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, పరిష్కారానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించామన్నారు. అనంతరం ఉద్యాన సహాయకుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా శెట్టి రాజు, ఉపాధ్యక్షుడిగా కొర్రా దశరథరామ్, ప్రధాన కార్యదర్శిగా కూడా గణపతిరాజు, కోశాధికారిగా కురిడె జానకిరామ్, కె.రమేష్, వర్కింగ్ పెసిడెంట్‌గా సిహెచ్.అనిల్‌కుమార్, కార్యదర్శులుగా వి.శోభన్, ముక్కి శివలింగం, కె.గోపాల్, మహిళా అధ్యక్షురాలుగా కె.రజిత, ఉపాధ్యక్షులుగా కె.శాంతికుమారి, కార్యవర్గ సభ్యులుగా సిరగం క్రిష్ణ, కె.మాధవరావు, బి.ప్రభాకర్‌పడాల్, బి.రవి, శెట్టి కొండబాబు, జి.నీలకంఠం, కె.సౌయిత, పుణ్యవతి, కృష్ణపడాల్, సుబ్బారావు ఎంపికయ్యారని చెప్పారు.

'బాధితులకు అండగా ఉంటాం'

జి.మాడుగుల, జూలై 28: తుపాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ నాయకుడు జర్రా అంకిత్ చెప్పారు. ఇటీవల తుఫాన్ తాకిడికి ఇల్లు నేలకూలిన మండలంలో జి.మాడుగుల పంచాయతీ సాడేకు గ్రామానికి చెందిన కోట లక్ష్మయ్య కుటుంబానికి ఆదివారం ఆయన పరామర్శించారు. ప్రభుత్వపరంగా న్యాయం చేయాడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నేతలు పాల్గొన్నారు.

జగన్ నామజపం వీడని ఉద్యోగులు..!

- లువ్వాసింగి సచివాలయంలో తొలగించని వైసీపీ ప్రభుత్వ పథకాల బోర్డు


లువ్వాసింగిలో గత ప్రభుత్వ పథకాల పట్టిక

జి.మాడుగుల, జూలై 28: రాష్ట్రంలో ప్రభుత్వం మారి సుమారు రెండు నెలలు కావస్తున్నప్పటికీ సచివాలయ సిబ్బంది మాత్రం వైసీపీ నేత జగన్ నామస్మరణ వీడినట్టు లేదు. మండలంలోని లువ్వాసింగి సచివాలయంలో ఇప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన పథకాల జాబితాతో కూడిన బోర్డునే ప్రకటిస్తుండడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకానికి సబంధించిన పథకాల వివరాల పట్టికను ప్రదర్శించడం సరి కాదని మండిపడుతున్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యాన్ని విమర్శిస్తున్నారు. నిబంధనల మేరకు ప్రస్తుత అధికారంలో ఉన్న ప్రభుత్వ పథకాల వివరాలు ఉండాల్సిన చోట గత ప్రభుత్వ పథకాల వివరాలు ఉంచడంతో ప్రజలకు తప్పుదోవ పట్టించినట్టు అవుతుందని, సంబంధిత సచివాలయ సిబ్బందిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.